క్లుప్తంగా

పని భారం తగ్గించండి



డీఎల్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కణేకల్లు: అదనపు పనిభారంతో ముఖ్యమైన విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శులు డీఎల్‌డీఓ నాగేశ్వరరావుతో ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాయలయంలో డీఎల్‌డీఓ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. వివిధ రకాల సరీ్వసులతో సెలువు దినాలను మనశ్శాంతితో గడప లేక పోతున్నామని కనీసం పండుగ రోజుల్లో కూడా ఫ్యామిలీతో ఉండలేని పరిస్థితి నెలకొందని కార్యదర్శులు గోడను వెళ్లబోసుకున్నారు. అదనపు పనితో తీవ్ర ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, హౌస్‌హోల్డ్ జియోట్యాగ్ తదితర సర్వేలన్నీ అదనపు పనులేనన్నారు. ఈ సర్వీసుల నుంచి ప్రభుత్వం తమను తప్పించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకెళ్తామని డీఎల్‌డీఓ చెప్పారు.

ఈపంట నమోదు తప్పనిసరి

ఉరవకొండ (విడపనకల్లు): జిల్లాలో పశుగ్రాస విత్తన జొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం విడపనకల్లు మండలం హవళిగి గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఏఓ మాట్లాడుతూ... మండలంలో అత్యధికంగా విత్తన జొన్నను సాగు చేసే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాబోవు సీజన్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు. రైతులు పండించే పశుగ్రాస విత్తన జొన్నను కంపెనీలే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పశుగ్రాసం విత్తన జొన్నకు ఎంఎస్‌పీ వర్తింపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించండి

- కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు



రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా విషయమై చర్చించారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణలపై తెలుసుకోవాలన్నారు. ఆయా గ్రామాలు, వార్డులలో ఓటరు జాబితాలలో ఏమైనా సందేహాలుంటే వెంటనే ఎన్నికల డీటీని సంప్రదించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలి

వజ్రకరూరు: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించా రు. మంగళవారం కొత్తకడమలకుంట, పాత కడమలకుంటలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ తిమ్మప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు, మధ్యాహ్నభోజన స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హఫీజున్నీసా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీరోజా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవుడిపై విధేయతతో జీవించాలి

కళ్యాణదుర్గం రూరల్: యేసుక్రీస్తు చూపిన మార్గంలో నడుస్తూ.. విధేయతతో జీవించాలని జీఎఫ్‌ఎం సంస్థ ఫౌండర్ రెవరెండ్ షేక్ ఇస్మాయిల్, రెవరెండ్ షేక్ బెన్సన్‌లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో సీఅండ్‌జీ మిషన్ చర్చిలో పాస్టర్ జీ.ప్రభుదాసు అధ్యక్షతన దైవసేవకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లను ఉద్దేశించి బైబిల్‌లోని ఆధ్యాత్మిక సందేశాన్ని బోధించారు. అనంతరం రెవరెండ్ బెన్సన్ పాస్టర్లందరి పాదాలను కడిగి విధేయతను చాటుకున్నారు. కార్యక్రమంలో తాలూకా పాస్టర్ల సంఘం నాయకులు చల్లా కిశోర్, జాన్సన్, సీనియర్ పాస్టర్లు బిజయ్య, డీఎస్‌పాల్, చల్లారాజశేఖర్‌చౌదరి, జేమ్స్ పాల్‌నాయక్, సంఘ పెద్దలు జోసెఫ్ కిశోర్, చార్లెస్, రవికుమార్ పాల్గొన్నారు.

22న సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట: ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ భవాని అధ్యక్షతన సమావేశం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, అమలు చేసిన యంత్రసేవ పథకాన్ని కూటమి ప్రభుత్వం మరుగున పడేసిందనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో తక్కువ ధరకే రైతులకు యంత్ర పరికరాలు సమకూర్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చిన్నసన్నకారు రైతులతోపాటు ఎస్సీ,ఎస్టీలకు రాయితీ పరికరాలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకొచ్చిన తర్వాత అన్నీ విస్మరించారు. కనీసం బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయింపులు లేవు. వ్యవసాయంలో కూలీల కొరత వేధిస్తుండడంతో యంత్రాలపై ఆధారపడిన రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.



మరుగున యంత్రసేవ

- పత్తాలేని వ్యవసాయ యాంత్రీకరణ పథకం
- పరికరాల కోసం రైతన్నల ఎదురుచూపు
- వైఎస్ జగన్ హయాంలో యంత్రసేవ అమలు
- సీహెచ్‌సీ గ్రూపుల ఆధ్వర్యంలో తక్కువ అద్దెకు యంత్రాలు

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 227 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 2022 జూన్ 8న మొదటి విడుతలో 98 కేంద్రాలకు గత ప్రభుత్వం ట్రాక్టర్లు, రొటావేటర్లు, ఇతర పనిముట్లను అందించింది. రెండో విడతలో 129 కేంద్రాల్లో సీహెచ్‌సీ గ్రూపులకు అవసరమైన పనిముట్లు చేర్చారు. రైతులకు తక్కువ ధరకే పనిముట్లు అందించేలా కృషి చేశారు. సులభ తరహా వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. ప్రస్తుతం పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా కేంద్రాలకు ప్రాధాన్యత తగ్గించడంతో యంత్రాలన్నీ కనుమరుగయ్యాయి.

రాయితీ యంత్రాలు ఎక్కడా?

అర్హత కలిగిన రైతులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో యంత్రాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ పెరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ లకు 90 శాతం రాయితీ ఇచ్చేలా ఆ వర్గాలు కోరుతున్నాయి. కూటమి సర్కార్ ఆ దిశగా ఆలోచన చేయడంలేదని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు.

వ్యవసాయం చేయలేం..



వ్యవసాయం అంటేనే ట్రాక్టర్లు, ఇతర యంత్రాలపై ఆధారపడుతున్నారు. గతంలో ఎద్దుల సేద్యానికి డిమాండ్ ఉండేది. ప్రస్తుత రోజుల్లో ఆధునిక సాంకేతికత పెరుగుతుండడంతో ఏ పనికైనా యంత్రాల వినియోగం తప్పనిసరి అయ్యింది. గత వైఎస్సార్ సీపీ హయాంలో యంత్ర పథకం అమల్లోకి తీసుకొచ్చి రైతులకు న్యాయం చేశారు. కూటమి సర్కార్ రాయితీ యంత్రాలు అందించాలి.

– సిద్దప్ప, రైతు, గలగల

పనిముట్లు అందించాలి



ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీతో ట్రాక్టర్లు, రొటావేటర్లు, ఇతర పనిముట్లు అందించాలి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు సమకూర్చాలి. వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల సంక్షేమానికి మాజీ సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. ప్రస్తుత ప్రభుత్వం దాని ఊసే ఎత్తడం లేదు. కనీసం బడ్జెట్‌లో కూడా తగిన నిధులు కేటాయించక పోవడం దుర్మార్గం.

– బేలోడు రామాంజనేయులు, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు, రాయదుర్గం

ఇఫ్తార్ విందులతో పుణ్యఫలం



సామూహిక ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో సామూహిక ఇఫ్తార్ విందులతో ఐక్యత, పుణ్యఫలం లభిస్తుందని మక్కా మసీదు ఇమామ్ ముఫ్తీ నూర్ మహమ్మద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో ఉపవాస దీక్ష అనంతరం కాలనీకి చెందిన యువకుల ఆధ్వర్యంలో సామూహిక ఇఫ్తార్ విందు జరిగింది. మగరీబ్ అనంతరం భారీ సంఖ్యలో ముస్లింలు ఇఫ్తార్‌లో పాల్గొన్నారు.

5 వాహనాల సీజ్

కణేకల్లు: కూలీలను తీసుకెళ్తున్న ఐదుగూడ్స్ వాహనాలను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నాగమధు తెలిపారు. నాగేపల్లి, మాల్యం, కణేకల్లు క్రాస్‌లో వ్యవసాయ పనుల కోసం కూలీలను గూడ్స్ వాహనాల్లో తరలిస్తుండగా, వాహన తనిఖీల్లో పోలీసులు అదుపులో తీసుకొని సీజ్ చేశారు. వీటిలో బొలెరో పికప్ రెండు వాహనాలు, గూడ్స్ ఆటోలు రెండు, ఒక ట్రాక్టర్ ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలించడం అత్యంత ప్రమాదకరమని ఎస్‌ఐ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అందులో ఓవర్‌లోడ్‌తో కూలీలను తీసుకెళ్లితే ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. సీజ్ చేసిన వాహనాలను రాయదుర్గం వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయండి

శెట్టూరు: ములకలేడు ప్రాంతంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి హెచ్.అక్కులప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న డిమాండ్ చేశారు. మంగళవారం ములకలేడులో మూతపడిన ఎస్సీ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా హాస్టల్ మూసివేశారన్నారు. దీంతో ఇక్కడ కర్ణాటక సరిహద్దుగా ఉన్న ఈ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ పిల్లలు తీవ్రంగా నష్టపోయారన్నారు. హాస్టల్ భవనం, గదులు సక్రమంగా ఉన్నాయని, సుమారు మూడు ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలంలో ఉన్న ఈ హాస్టల్ నిరుపయోగంగా ఉందన్నారు. ఇక్కడ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. స్థానిక తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంఈఓ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైలర్ వన్నూరుస్వామి, ఎంఎస్‌ఎఫ్ నాయకులు నగేష్, ఎస్సీ, ఎస్టీ పర్యవేక్షణ సమితి ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, విద్యార్థి సంఘ నాయకులు పృథ్వీ, తాలుకా అధ్యక్షులు లక్ష్మణమూర్తి, నాయకులు బ్రహ్మసముద్రం లక్ష్మన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

నిధుల లేమితో ఆగిన రహదారి పనులు

గుమ్మఘట్ట: రాయదుర్గం నుంచి కర్ణాటక సరిహద్దున ఉన్న గొల్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పనులు నిధులు లేక ఆగిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 7.5 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎండీఆర్ నిధుల ద్వారా రూ.13 కోట్లు మంజూరు చేశారు. దీంతో రోడ్డు నిర్మాణపు పనులు చకచకా జరిగాయి. రూ.4.8 కోట్లతో కల్వర్టులు, మెటలింగ్ పనులు చేశారు. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పనులు ఆగిపోయాయి. మిగిలిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు పూర్తి చేయాలని గొల్లపల్లి, సిరిగెదొడ్డి, గలగల, చెరువుదొడ్డి, పైదొడ్డి, కరిసూరయ్యదొడ్డి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి నిధులను విడుదల చేసింది. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈఈ శివ శంకర్‌రెడ్డిని అడగ్గా.. రోడ్డు పనులు ఆగిపోయిన మాట వాస్తవమే. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



ఆగిపోయిన గొల్లపల్లి రోడ్డు విస్తరణ పనులు

పెన్నహోబిలం హుండీ ఆదాయం రూ. 29.10 లక్షలు



పెన్నహోబిలంలో శ్రీవారి హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ కానుకలు మంగళవారం లెక్కించారు. జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు పర్యవేక్షణలో ఆలయ ఈఓ సాకేరమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 144 రోజుల శాశ్వత హుండీ కానుకలు లెక్కించగా రూ.29,10,920 మొత్తం శ్రీవారికి సమకూరింది. కార్యక్రమంలో గుంతకల్లు హనుమాన్ సేవా సంస్థ సభ్యులు, బళ్లారి వీరభద్రస్వామి సేవా సమితి సభ్యులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

చేపపిల్లల పెంపకంతో జీవనోపాధి మెరుగు



చేపపిల్లలను వదులుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: చేప పిల్లల పెంపకంతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడుతుందని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ చెరువులో 16,400 చేపపిల్లలను వదిలారు. పీఎంఎంఎస్‌వై పథకం కింద 40 శాతం సబ్సిడీతో చేప పిల్లలను వదిలారు. ఎఫ్డీఓ పెద్దబాబు నాయక్ మాట్లాడుతూ మత్స్యకార్మికుల జీవనోపాధి మెరుగునకు చేపపిల్లల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. కాగా మత్స్యకారులు మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ మాసాల్లో చేపపిల్లలను వదలాల్సి ఉండగా, నీరు తగ్గుముఖం పట్టే సమయంలో వదలడం సరికాదన్నారు. ఎండలకు చేప పిల్లలు బతకడం కష్టమన్నారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు ఫక్కీరప్ప, డిస్ట్రిబ్యూటరీ ఉపాధ్యాయులు మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి శివన్న పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరి

- వ్యాక్సినేషన్ కార్యక్రమంలో డీడీ వెంకటేష్

ఉరవకొండ: పశుపోషకులు గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరిగా వేయించాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ సూచించారు. మంగళవారం మండలంలోని వ్యాసాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని డీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నుంచి పశువులు, మూగజీవాలకు గాలికుంటు వ్యాధి టీకా వేయించాలన్నారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పాడి రైతులు, గొర్రెల పోషకులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించాలన్నారు. సిబ్బంది సిరాజ్, రవి, శ్రీనివాసులు, లావణ్య పాల్గొన్నారు.

కూడేరు: పశు పోషకులు గాలింటు వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కలగళ్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. పశు వైద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశు పోషకులకు తెలిపారు. వీహెచ్‌ఏలు యశోద, రఘు వర్ధన్, రామాంజనేయులు, భవాని ,దామోదర్ పాల్గొన్నారు.



వ్యాసాపురంలో గాలికుంటు టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీడీ వెంకటేష్

పార్టీకి ద్రోహం చేస్తే ఉపేక్షించం

- బాబు విధ్వంస పాలనపై ప్రజలు విసుగు
- జగన్ సీఎం అయ్యుంటే ప్రతి ఇంటా సంక్షేమం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు

డి హీరేహాళ్ (రాయదుర్గం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీకి ద్రోహం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి హెచ్చరించారు. మంగళవారం డి హీరేహాళ్ మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గార్మెంట్స్ హనుమంతరెడ్డి చేపట్టిన మారెమ్మపూజలో మెట్టు పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకొని కూటమి పార్టీకి పనిచేస్తే చర్యలు తప్పవన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని విభాగాల్లోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మార్చే ప్రసక్తే లేదన్నారు. ధిక్కార స్వరం వినిపిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ కేడర్‌ను బలోపేతం చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు. తొమ్మిది నెలల్లోనే చంద్రబాబు విధ్వంస పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారన్నారు. డీబీటీ ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకి రూ.2.84 కోట్లు జమ చేసిన ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటా మేలు చేసే వలంటీర్లు కూటమి ప్రభుత్వంలో కనుమరుగయ్యారన్నారు. సంక్షేమం, అభివృద్ధి జాడలేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిలో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఓటమి తప్పదన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాన రాష్ట్ర జీడీపీ తగ్గిపోయిందన్నారు. ప్రజల ఖాతాల్లో సొమ్ము లేక చిరు వ్యాపారులు, ఇతర వర్తకులు ఇబ్బందులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు.

విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు..

ఏప్రిల్ నుంచి పార్టీ కార్యక్రమాలు గ్రామగ్రామానా విస్తృతంగా చేస్తామని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. పార్టీపై దుష్ప్రచారం చేసే వారికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. వెన్నుపోటు దారుల కుట్రల నుంచే గత ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. మెట్టు గోవిందరెడ్డి అంటేనే ప్రజల్లో విశేష ఆదరణ ఉన్న వ్యక్తి అని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ బోజరాజ్‌నాయక్, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు తొండ వెంకటేసులు, యూత్ అధ్యక్షులు హెచ్‌కే హనుమతరెడ్డి, జాజరకల్లు సందీప్ పాటిల్, సర్పంచ్ సుదర్శనరెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకులు నాగలాపురం అంజిరెడ్డి, వన్నూర్‌స్వామి, హిర్దేహాళ్ మంజు, కల్యం చిత్రయ్య, హొసగుడ్డం ఎంపీటీసీ శివలింగప్ప, రాజు, దొడ్డయ్య, హనుమంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్టు (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్మికులపై పనిభారం తగ్గించాలి

రాయదుర్గంటౌన్: పట్టణ జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి, ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగం ఇప్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ఔట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు టీఏ, డీఏలను ఇవ్వాలని కోరారు.

మారెమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

బ్రహ్మసముద్రం : సంతే కొండాపురంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ ఆలయానికి రూ.30 వేలు నగదు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. సూగేపల్లికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఈశ్వర్ రెడ్డి నగదును అందించారు. కొండాపురం రాము, నరసింహప్ప ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ బిల్లుల మంజూరు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు బిల్లులు మంజూరయినట్లు ఏపీఓ లక్ష్మీకాంతబాయి తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. 2025 జనవరి 14 నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు మంజూరు అయినట్లు తెలిపారు.

గుండునాగప్ప స్వామి మండలపూజ

కూడేరు: మండలంలోని కొర్రకోడు–చోళసముద్రం గ్రామాల మధ్య వెలిసిన అతిపురాతన మైన గుండు నాగప్పస్వామి ఆలయంలో మంగళవారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. గుండు నాగప్ప స్వామి నామస్మరణ మార్మోగింది. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి మాట్లాడారు. క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

సంక్షిప్త సమాచారం

జాతీయ రహదారి పక్కనే భారీగా చనిపోయిన కోళ్లు



ఉరవకొండ: 42వ జాతీయ రహదారిపై మృతి చెందిన కోళ్లను పారేసిన దృశ్యం

ఉరవకొండ: 42వ జాతీయ రహదారి వద్ద బళ్లారి రోడ్డు వైపు ఈద్గా ఖబరస్తాన్ సమీపంలో మంగళవారం మృత్యువాత పడిన వందలాది కోళ్లను వ్యాపారులు పడేశారు. దీంతో కోళ్లు ఎందుకు చనిపోయాయోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కనీసం పంచాయతీ, పశుసంవర్ధకశాఖ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

మామిడి,చింత చెట్ల దగ్ధం

కంబదూరు: మండలం కేంద్రంలోని భీమలకుంట రోడ్డు సమీపంలోని తలారి ఎర్రిస్వామి అనే రైతుకు చెందిన వందకు పైగా చింతచెట్లు, 50 మామిడి చెట్లు మంగళవారం కాలిపోయాయి. రైతు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతు తెలిపాడు.

అక్రమ లేఅవుట్‌లపై కఠిన చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: అక్రమంగా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని మున్సిపాల్ కమిషనర్ వంశీ కృష్ణ తెలియజేశారు. మంగళవారం మున్సిపాల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమిషన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 36 అక్రమ లేఅవుట్‌లను గుర్తించామన్నారు. మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్లాట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో అప్రూవల్ లేకుండా అక్రమంగా లే అవుట్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపచరితకుంటను కాపాడండి

రాయదుర్గంటౌన్: ఉపచరితకుంటను దురాక్రమణ దారుల నుంచి కాపాడాలని వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ రాయదుర్గంశాఖ అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ పురాతన ఆలయాలైన ప్రసన్న వేంకట రమణస్వామి, జంబుకేశ్వరస్వామి ఆలయాలకు పూజా కైంకార్యాల నిమిత్తం పూర్వం ఏర్పాటు చేసుకున్న ఉపచరకుంట కోనేరును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున, తట్టే నగేష్, ఆంజనేయులు, పూజారి ఆనంద్ పాల్గొన్నారు.

పైతోట ఫారెస్టుకు నిప్పు



రాయదుర్గంటౌన్: పట్టణ శివారు పైతోట ఫారెస్ట్‌కు సోమవారం రాత్రి నిప్పంటుకుంది. సీతాఫలం చెట్లు, పశుగ్రాసం కూడా కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టి ఉంటారని తెలిపారు. అడవికి నిప్పు అంటుకున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సిబ్బందితోపాటు గ్రామ యువకులు ఎంతో శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా ఇటీవల పట్టణంలోని సిద్దేశ్వర కాలనీకి ఆనుకున్న కొండపై కూడా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వృక్షసంపద కాలిపోయింది. పచ్చని అడవులును నిప్పు పెట్టి నాశనం చేయరాదని, వాతావరణాన్ని కాపాడాలని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి సూచించారు.

మాతా,శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

అనంతపురం మెడికల్: మాతాశిశు మరణాలను నివారించాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గతనెలలో జరిగిన మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు.

భార్య ఆరోగ్యంపై నిర్లక్ష్యమెందుకు?

బ్రహ్మసముద్రం మండలం భైరవసముద్రానికి చెందిన తిప్పమ్మ(32) గత నెల 11న మూడో కాన్పుకోసం సర్వజనాస్పత్రిలో చేరింది. కష్టకాన్పుతో మృతిచెందింది. మూడో కాన్పు ఇబ్బందికరమని, తిప్పమ్మ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని వైద్యులు చెప్పినా ఎందుకు నిర్లక్ష్యం చేశావని డీఎంహెచ్‌ఓ హనుమంతప్పను ప్రశ్నించారు. దీంతో అతడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ప్రస్తుతం బిడ్డ ఐసీడీఎస్ సంరక్షణలో ఉంది. డీఐఓ డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

శెట్టూరు: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ వసంతబాబు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ పర్యటించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇంచార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, పంచాయతీ సిబ్బంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వేల్లో జిల్లాలోనే శెట్టూరు మండలం వెనుకబడిందని అన్నారు.